ప్రజాశక్తి

సోమవారం 20 అక్టోబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ట్రంప్ చిత్రపటం దహనం

పని ఒత్తిడితో రాజధాని పారిశుధ్య కార్మికులు

లోపలి పేజీల్లో

తెనాలిలో యువకుడి కిడ్నాప్ కలకలం

కారులో పారిపోతున్న బృందాన్ని పట్టుకున్న పోలీసులు

హృద్రోగులకు సంజీవని టెనెక్ట్ ప్లస్ ఇంజెక్షన్లు

ఈ ఏడాది 160 మందికి పైగా గుండెపోటు బాధితులకు ఇంజెక్షన్ ద్వారా 98 శాతం ఫలితాలు



తాడేపల్లి మండలంలో ఆకుకూరల మడుల్లో వర్షపునీరు

రైతుల గుండెల్లో వాయుగండం

- భారీ వర్షాల హెచ్చరికలతో బెంబేలు
- వరి, ఉద్యాన పైర్లకు ముంపు బెడద
- పత్తి, శనగ, కంది సాగుదారులకు దిగులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడనుందని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈనెల 24న వాయుగుండం ఏర్పడి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఇప్పటికే అధిక వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరు పల్నాడు జిల్లాల్లో వరి, పత్తి, కంది, శనగ, మిర్చి సాగు దారులకు వర్షం గండం పైర్లను దెబ్బతీస్తుందన్న ఆందోళన నెలకొంది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో తొలి విడత తీసిన పత్తి రైతుల ఇళ్లకు చేరుతోంది. 10 రోజులుగా మొదటి విడత పత్తితీతలు ప్రారంభమయ్యాయి. కాయలు పగిలి పత్తి తీయడానికి సిద్ధంగా ఉన్న ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే పత్తి నేలవారుతుందనే భయం వెంటాడుతోంది. కొన్ని ప్రాంతాల్లో పూత రాలిపోయే ప్రమాదం లేకపోలేదు.

పల్నాడు జిల్లాలో 2.26 లక్షల ఎకరాలు, గుంటూరు జిల్లాలో 60 వేల ఎకరాలలో ఈ ఏడాది పత్తి సాగు చేశారు. ఎర్ర తెగులు, గులాబి పురుగు పత్తి పైరును వెంటాడుతోంది. కొంత కాలంగా తెగుళ్లతో రైతులు అల్లాడుతున్నారు. పత్తి కొనుగోలు ప్రారంభం కాక తీసిన పత్తిని తమ నివాసాల్లో దాచుకోలేక రైతులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది పత్తి క్వింటాళ్ కనీస మద్ధతు రూ.8110గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవ్వక కొంతమంది అయినకాడికి అమ్ముకుంటున్నారు. ఈ నేపథ్యంలో పంటను కాపాడుకోవడం, తీసిన పత్తిని విక్రయించుకోవడానికి రైతులు కష్టపడక తప్పడం లేదు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 90 వేల ఎకరాల్లో మిర్చి సాగైంది. మిర్చి వివిధ దశల్లో ఉంది. పల్నాడు జిల్లాలోని

▶ 2లో

పంట పొలాలు మళ్లీ మునక

2లో



మాట్లాడుతున్న సూర్యతేజ

లక్ష్యం స్పష్టమైతే విజయం ఖాయం

ఎపి టెక్నాలజీ సర్వీసెస్ ఎమ్‌డి మల్లవరపు సూర్యతేజ

ప్రజాశక్తి-గుంటూరు

చిన్న వయసులోనే లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ దిశలో క్రమశిక్షణతో కృషిచేస్తే సామాన్యులకు కూడా విజయం తథ్యమని ఐఎఎస్ అధికారి మల్లవరపు సూర్య తేజ అన్నారు. గుంటూరులో జెకెసి కళాశాల ఆడిటోరియంలో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో ఆయన ఉత్తేజపూరితమైన ప్రసంగం చేశారు. మానవత సెక్రెటరీ కె.సతీష్ ఈ కార్యక్రమానికి అనుసంధానకర్తగా వ్యవహరించగా సూర్యతేజ మాట్లాడుతూ మంచి పరిస్థితులు, వనరులు, వ్యూహం ఉంటే సామాన్యులు కూడా విజేతగా మారవచ్చని ఉద్బోధించారు. పోటీ పరీక్షల్లో ఎన్ని పుస్తకాలు చదివాము అన్నది ముఖ్యం కాదని, చదివిన ఒక్క పుస్తకాన్ని విపులంగా, క్షుణ్ణంగా అవగాహన చేసుకొని సొంతంగా నోట్స్ తయారు చేసుకోవడం పోటీ పరీక్షల విజయ రహస్యమని వివరించారు. కార్యక్రమంలో జెకెసి కాలేజి ఆంగ్ల విభాగాధిపతి పంచుమర్తి నాగసుశీల, మానవత చైర్మన్ పావులూరు రమేష్, ప్రెసిడెంట్ కోట శ్రీనివాస్, డైరెక్టర్స్ సూర్యదేవర కష్ణప్రసాద్, చావా లక్ష్మీ సామ్రాజ్యం పాల్గొన్నారు.



పెన్షన్లు అందచేస్తున్న గురుప్రసాద్ తదితరులు

అవోపా ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

అవోపా ఆధ్వర్యంలో కె.వి.బ్రహ్మం అధ్యక్షతన 38వ పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఆదివారం అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ సాయి ప్రగతి ఇన్‌ఫ్రా డెవలపర్స్ డైరెక్టర్ తెడ్ల గురుప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈనెల పెన్షన్ మొత్తాన్ని విరాళంగా అందజేశారు. అవోపా సామాజిక, విద్యాసేవలను ఆయన కొనియాడారు. డైరెక్టర్లు ఇ.పాండురంగ సురేష్, సిహెచ్.నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొని అవోపా కార్యక్రమాలకు సహకారం అందిస్తామని చెప్పారు. అవోపా గుంటూరు సెక్రెటరీ వెచ్చా రాధాకృష్ణయ్య, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రాచపూడి సుబ్బారావు ప్రసంగించారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణి

ప్రజాశక్తి - తెనాలిరూరల్

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పంపిణి చేశారు. స్థానిక సుల్తానాబాద్ ఆలపాటి నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ పరిధిలో 21 మందికి రూ.9,59,180 చెక్కులను ఎమ్మెల్సీ రాజేంద్ర ప్రసాద్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి సిఎం సహాయనిధి సంజీవని వంటిదని చెప్పారు.



చెక్కులు పంపిణి చేస్తున్న ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్



కుంచనపల్లిలోని అరటి తోటలో చేరిన వర్షపు నీరు

పంట పొలాలు మళ్లీ మునక



గుండిమెడలోని పంట పొలాలలో నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

అధిక వర్షాలతో రైతుకు దెబ్బ మీద దెబ్బ తగులుతూనే ఉంది. ఇటీవల కాలంలో అధిక వర్షాలు విపరీతంగా కురవడం వల్ల ఎక్కడి వర్షపు నీరు అక్కడే పంట పొలాలలో నిలిచింది. చేతికొస్తుంది పంట అనే సమయానికి అధిక వర్షం భారీ వర్షాల రూపంలో రైతు కంట కన్నీరుగా మారుతోంది. ఆదివారం తెల్లవారు జామున భారీ వర్షానికి తాడేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లోని వందలాది ఎకరాల్లో వర్షపు నీరు నిలిచింది. పసుపు, అరటి, కంద, కరివేపాకు వంటి పొలాలు ముంపుబారిన పడ్డాయి. కుంచనపల్లిలో ఆకుకూరల పై ఆధారపడిన కౌలురైతులు ఈ భారీ వర్షాలు, అధిక వర్షాలకు ఇప్పటికే నాలుగు ఐదు సార్లు పంటలు, నష్టపోయామని మళ్లీ నీరు నిలిచిందని ఆవేదనకు గురవుతున్నారు. గుండిమెడ, మెల్లెంపూడి పొలాల్లో వాన నీటిని రైతులే స్వయంగా పొక్లెయిన్ల ద్వారా గండ్లు కొట్టుకొని బయటకు పంపుతున్నారు. మురుగు కాల్వలు పూడిక తీయని కారణంగా ఈ దుస్థితి తలెత్తుతోంది.

సాహిత్యంలో హాస్యం ఆరోగ్యప్రదం

ప్రజాశక్తి - గుంటూరు

సాహిత్యంలో హాస్యం ఆరోగ్యప్రదం అని ప్రముఖ సాహితీవేత్త వసుధ అన్నారు. అమరావతి సాహితీ మిత్రులు బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన సాహిత్య సభకు సంస్థ అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షత వహించగా వసుద మాట్లాడుతూ ప్రాచీన సాహిత్యంలోని చాటువులు, ప్రముఖుల పద్యాలు, జరుక్‌శాస్త్రి ప్యారడీలు, ఆరుద్ర అంత్య ప్రాసల కవితలు, అనేక చమత్కార మినీ కవితలు వినిపించి సభను రంజింపచేశారు. సభలో 'ఈ మాసం కవి'గా మాన్సింగ్ పాల్గొని జనరంజకమైన గేయాలను పాడి వినిపించారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవితా పఠన కార్యక్రమంలో సంబరాజు రమణి, చల్లా సత్యవతి, గడల శివప్రసాద్, ఎ.శంకర్, బండికల్లు జమదగ్ని, మేడిశెట్టి సుభద్ర కృష్ణ, డాక్టర్.మైలవరపు లలితకుమారి, పుట్టంరాజు నరసింహమూర్తి, పూసపాటి కృష్ణ సూర్యకుమార్, మన్నం వెంకటగురువు, డాక్టర్ ఆర్.కుమారస్వామి, సౌపాటి ప్రభాకర్, లంక మాధవి, కృష్ణభార్గవి పాల్గొన్నారు. తొలుత 'సినీ మధుర గేయం' శీర్షికలో డాక్టర్ రావి రంగారావు 'చిన్నారి పొన్నారి పువ్వు' అనే దాశరథి రాసిన సినీగేయాన్ని వినిపించి కవిత్వ విశ్లేషణ చేశారు. నాకు నచ్చిన కవిత శీర్షికలో ఆశారాజు రాసిన కృతజ్ఞతలు కవితను యర్రగుంట్ల పాణిరావు చక్కగా విశ్లేషించారు. సభలో డాక్టర్ సూర్యదేవర రవికుమార్‌కు మచిలీపట్నం సాహితీ మిత్రులు పక్షాన డాక్టర్ రావి రంగారావు, డాక్టర్ టి.సేవాకుమార్ జ్ఞాపికను, నగదు బహుమతిని అందజేశారు. వసుధను, ఈ మాసం కవిగా మాన్‌సింగ్‌ను, 'నిక్కచ్చి కవిత' పోటీ విజేత ఎ.శంకర్‌ను సత్కరించారు.



కవులను సత్కరిస్తున్న రావి రంగారావు, డాక్టర్ సేవాకుమార్

డిఎ బకాయిలు విడుదల హర్షణీయం : ఎపి ఎన్‌జిఒ

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగులపట్ల ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పెండింగ్‌లో ఉన్న డి.ఎ బకాయిలలో ఒక విడత డి.ఏను విడుదల చేయటం హర్షణీయమని ఏపీ ఎన్‌జిజిఓ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, ఆరాధ్య శ్యాంసుందర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏళ్లతరబడి రోడ్డు రవాణా శాఖలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను కూడా యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించటం, నూతన పిఆర్‌సి అమలుకి కమిషనర్ నియామకానికి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడం, 2004 నోటిఫికేషన్ ముందు నియామకమైన ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్ వర్తింపచేస్తామని ప్రకటించటం, ఉద్యోగ సంఘ భవనాలకు ఆస్తి పన్ను పూర్తిగా బకాయిలతో సహా రద్దు చేయడం, చైల్డ్ కేర్ లీవులు పదవీ విరమణ వరకు వాడుకునే వెసులుబాటు కల్పించడం లాంటి ప్రయోజనాలన్నీ ఉద్యోగులకు మేలు చేకూరుస్తాయన్నారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం స్నేహపూర్వక వాతావరణం కలిగి ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ప్రకటించడం సంతోషదాయకమన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు రూ.25 వేల కోట్లలో ఈ కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత రూ.10 వేల కోట్ల వరకు చెల్లించారని, ఇదెంతో శుభ పరిణామం అన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సి ఎర్న్డ్ లీవ్ ఎన్‌క్యాషమెంట్ బిల్లులు కూడా కాలక్రమేణా చెల్లిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం ఆహ్వానించదగిందన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా ఉపాధ్యక్షులు సూరే పల్లి రాజశేఖర్, జిల్లా సంయుక్త కార్యదర్సులు కృష్ణ కిషోర్, కూరాకుల శ్రీనివాసరావు, సయ్యద్ జానీబాషా, విజయ్ పాల్గొన్నారు.



రైతుల గుండెల్లో వాయుగండం

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని గ్రామాల్లో ఎదుగుదల దశలో ఉండగా మరికొన్ని ప్రాంతాలలో పూత దశలో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో భారీ వర్షాలు కురిస్తే పైర్లకు నష్టం జరిగే అవకాశం ఉంది. పల్నాడు జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురిసి కాల్వలకు పుష్కలంగా నీరు రావడం వల్ల నిర్దేశిత విస్తీర్ణంలో లక్ష ఎకరాల్లోనే వరి సాగు పూర్తయింది. 53 వేల ఎకరాల్లో కంది సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 58 వేల ఎకరాల్లో వేశారు.

గుంటూరు జిల్లాలో 2.10 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, ఇతర పంటల సాగయ్యాయి. ప్రధానంగా జిల్లాలో 1.42 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. జిల్లాలో ప్రస్తుతం వరి పైరు పొట్టదశలో ఉంది. జులై, ఆగస్టులో సాగు చేసిన ప్రాంతాల్లో మాత్రం కంకిదశలో ఉంది. ఈ తరుణంలో భారీ వర్షాలు కురిసి ముంపునకు గురైతే ఇబ్బందులు రావొచ్చని రైతులుంటున్నారు. దీని ప్రభావం దిగుబడులపై ఉంటుంది. గత 24 గంటల్లో మంగళగిరి, తాడేపల్లిలో భారీ వర్షం కురవడగా మిగతా ప్రాంతాల్లో ఒక మోస్తరుగా వర్షం కురిసింది. మంగళగిరిలో 74 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా తాడేపల్లిలో 65 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది.



సమావేశంలో ఒక్కచోట చేరిన పూర్వ విద్యార్థులు

44 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1980/81 బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. సుమారు 25 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని వారి చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ గ్రూప్ ఫొటోలు దిగారు. చదువు చెప్పిన గురువులకు వారి జ్ఞాపకాలను ఒకరికి ఒకరు గుర్తు చేసుకున్నారు. వారికి సంబంధించిన అడ్రస్‌లు పంచుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన ఎంపీడీవో బి.నాగరాజును సత్కరించారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పూర్వ విద్యార్థులు పైడి నాయుడు, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, ఐజాక్, రంగారెడ్డి, జంగయ్య, అయేషాను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన సౌత్ సెంట్రల్ రైల్వే డీసీఎం కె.కమలాకర్‌బాబు, నల్లగొండ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు, మిర్యాలగూడ కేరళ విద్యా సంస్థల అధినేత షేక్ అహ్మద్, బెంగళూరు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, మాలతి, సరళ, లిల్లీ పాల్గొన్నారు.

టిడిపి దురాగతాలపై పోరాటం : అంబటి



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గంలోని రాళ్లపాడులో టిడిపి నాయకులు కాకర్ల హరిశ్చంద్ర ప్రసాద్ ఒకే సామాజిక తరగతికి చెందిన ముగ్గురిని రోడ్డు ప్రమాదం ముసుగులో హత్య చేయడానికి పన్నిన పన్నాగంపై బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. హత్యకు గురైన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కుటుంబ సభ్యులతో పాటు వారి దాడిలో తీవ్రంగా గాయపడి గుంటూరులోని ఉదయ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కుటుంబం మీద మారణకాండ జరిగి 20 రోజులైనా ఇంత వరకు ప్రభుత్వం స్పందించలేదన్నారు. కాపు సామాజిక వర్గానికి చెందిన ముగ్గురిపై టిడిపి వారు అధికారదర్పంతో వాహనంతో ఢీకొట్టి ముగ్గురిని చంపడానికి ప్రయత్నించారని, వీరిలో లక్ష్మీనాయుడు ఘటన స్థలంలో మృతి చెందాడని అంబటి తెలిపారు. లక్ష్మీనాయుడు, భార్గవ్, పవన్ ముగ్గురు కలిసి కందుకూరు వెళ్తున్నప్పుడు ఎదురుగా వచ్చి కాకర్ల హరిశ్చంద్ర ప్రసాద్ కారుతో ఢీ కొట్టి వారు ముగ్గురు కింద పడిపోవడంతో వారిని చంపాలన్న ఉద్దేశంతో ఒకటికి రెండు సార్లు కారును వారిపై ఎక్కించారని అన్నారు. లక్ష్మీనాయుడు చనిపోగా పవన్, భార్గవ్ గుంటూరులో చికిత్స పొందుతున్నారని వారిని, పవన్ తండ్రి శ్రీనివాసును, వారి కుటుంబ సభ్యులను పరామర్శించినట్టు తెలిపారు. హత్యాకాండను ప్రమాదంగా చిత్రీకరించి టిడిపి నాయకులు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని అంబటి ఆరోపించారు. ఈ ఘటనపై రాజకీయ పరంగా కాకుండా సామాజికపరంగా పోరాటం చేస్తామని తెలిపారు, బాధితులకు జరుగుతున్న అన్యాయాన్ని వెలుగులోకి తెచ్చి టిడిపి దురాగతాలను, పోలీసుల పక్షపాత చర్యలను ఎండగతామని తెలిపారు. వైసిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా కూడా ఆదివారం రాత్రి క్షతగాత్రులను,వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టిడిపి దురాగతాలపై పోరాటం చేస్తామన్నారు.



అసోసియేషన్ లోగో ప్రారంభిస్తున్న సిఐ సాంబశివరావు

ఆంధ్ర ప్యారిస్ వీడియో అండ్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో నూతనంగా ఏర్పాటుచేసిన ది ఆంధ్రా ప్యారిస్ వీడియో అండ్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ను పట్టణ త్రీ టౌన్ సిఐ సాంబశివరావు ఆదివారం ప్రారంభించారు. స్థానిక జ్యోతి ఫర్నిచర్స్ హాలులో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసాద్ ల్యాబ్ అధినేత ప్రసాద్ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్స్ సంక్షేమం, భద్రత, వఅత్తి గౌరవం వంటి అంశాలను వివరించారు. అసోసియేషన్ లోగోను సీఐ ప్రారంభించారు. అసోసియేషన్ కొత్త కార్యవర్గం వివరాలను వ్యవస్థాపక అధ్యక్షుడు పిల్లి ఫ్రాంక్లిన్‌బాబు వెల్లడించారు. అధ్యక్షులుగా కాళిదాసు చైతన్య, సెక్రటరిగా గ్లోరియస్ నాగరాజు, వైస్ ప్రెసిడెంట్గా ఆనంద్ డిసౌజా, జాయింట్ సెక్రటరీగా షేక్ రఫీ, కోశాధికారిగా కొల్లి భరత్ కుమార్, పిఆర్వోగా యు.నాగ గోవర్ధనరావు, గౌరవ సలహాదారులుగా ఎస్.కె.కాలేషా, ఎన్ఎం డిజిటల్స్ గిరీష్, ఎన్ఆర్టి శ్రీనివాసరావు నియమితులైనట్లు చెప్పారు. కార్యక్రమంలో విజయ సారధి బాబు, ఎస్ఎస్వి శేఖర్, రాజు, శ్రీకాంత్ ,శివ సాగర్, సూర్య, బాజీ పాల్గొన్నారు.

22 నుండి ఎస్ఆర్ఎంలో అమరావతి సాహిత్య ఉత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఈ నెల 22 నుంచి ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో అమరావతి సాహిత్య ఉత్సవం జరుగనుంది. మూడ్రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో ప్రముఖ కవులు, సాహితీ వేత్తలు, విమర్శకులు, వివిధ రంగాల విద్యావేత్తలు, భాషా ప్రముఖులు పాల్గంటున్నారు. యూనివర్సిటీలోని భాషా సాహిత్య విభాగం అధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. యూనివర్సిటీ యాజమాన్యం ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసింది. భాషా సాహిత్య రంగాల్లో నిష్ణాతులైన కవులు, సాహితీకారులు, విద్యావేత్తలు, విమర్శకులను ఒకే వేదికపైకి తీసుకు రావడంతో పాటు వివిధ భాషలను ప్రోత్సహించడం ఈ ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని ఉత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్ ఆమ్లాన్ బైశ్యా పేర్కొన్నారు. 22 వ తేదీన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్ ఉత్సవాలను ప్రారంభించనున్నారు. కొత్త నగరం- కొత్త స్వరాలు నినాదంతో జరిగే ఈ ఉత్సవాలలో భాష, సాహిత్యంపై బఅంద చర్చలు, ప్రముఖుల అభిప్రాయాలు, సందేశాలు ఉంటాయని వైశ్యా వివరించారు. ప్రముఖ తెలుగు స్త్రీ వాద రచయిత్రి పి లలితకుమారి (ఓల్గా), పద్మశ్రీ గణేష్ ఎన్ దేవి, పి సత్యవతి, రమేష్ కార్తీక్, కడలి సత్యనారాయణ వంటి సాహిత్య రంగ ప్రముఖులు ఉత్సవాలకు హాజరవుతున్నారు. 24వ తేదీన ప్రఖ్యాత కూచిపూడి కళాకారిణి కుమారి కోకా విజయలక్ష్మి బఅందం తెలుగు ప్రశస్తి నఅత్య రూపకాన్ని ప్రదర్శించనున్నారని నిర్వాహకులు తెలిపారు.

ఆయుర్వేదం సంపూర్ణ వైద్య విధానం

ప్రజాశక్తి-గుంటూరు

ఆయుర్వేదం భారతదేశానికి చెందిన ఒక సంపూర్ణ వైద్య విధానమని చెన్నై ఆయుర్వేద వైద్య కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ పి.ఎస్.ఆర్.శివకళ్యాణ్ అన్నారు. అవగాహన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్యసభలో డాక్టర్ శివకళ్యాణ్ మాట్లాడుతూ ఇది ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించటంపై దష్టి పెడుతుందని, శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రధానంగా చికిత్స జరుగుతుందని అన్నారు. వ్యాధుల సాధ్యాసాధ్యతలను చికిత్సతో ప్రభావితం చేయవచ్చనేది ఆయుర్వేద దక్పథమని, చికిత్స లేదనుకొని ఆశ వదిలేసుకున్న అనేక మందికి ఆయుర్వేద వైద్య విధానంతో స్వస్థత చేకూరిందన్నారు. ఆయుర్వేదం అనేది ఆయుష్షను, జీవితాన్ని గూర్చి వివరించే శాస్త్రమని, ఆరోగ్య అవగాహనకు, వైద్యపరమైన చైతన్యానికి అవసరమైన ఎన్నో మార్గదర్శకాలు ఆయుర్వేద వైద్య విధానంలో ఉన్నాయన్నారు. ఆయుర్వేదం నిస్సందేహంగా ప్రపంచంలో అత్యంత సనాతనమైన, పరిపూర్ణమైన సశాస్త్రీయమైన వైద్య విధానమన్నారు.టెస్టులు, ఇన్వెస్టిగేషన్ పాత్ర లేకుండా లక్షణాల ఆధారంగా చేసుకుని 90 శాతం వ్యాధులు ఆయుర్వేద వైద్యులు గుర్తిస్తున్నారన్నారు. ఆయుర్వేద మందులు వాడే ముందు సంబంధిత డాక్టర్ సలహాతో వాడటం మంచిదని, ఆస్తమా, గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ వంటి వాటికి ఆయుర్వేదం నమ్మకమైన చికిత్స అందిస్తుందన్నారు.అనంతరం డాక్టర్ శివ కళ్యాణ్‌ని సత్కరించారు.కార్యక్రమంలో వివి రావ్ అధ్యక్షత వహించగా, ఇందుశేఖర్, ఎ.చలమారెడ్డి, ఆర్.వెంకటరత్నం, కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శివకళ్యాణ్

బిసిఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా కె.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా కె.శ్రీనివాసులు ఎన్నికయ్యారు. బిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ద్వితీయ మహాసభ గుంటూరులోని పించనర్ల అసోసియేషన్ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈసభలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్రం నలుమూల నుంచి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు అయ్యారు. సమావేశానికి ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షులు శివపూర్ణయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా పి.వి.రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా బట్టా భాస్కర యాదవ్, ఆర్థిక కార్యదర్శిగా వరికల్లు శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా కోటపాటి హరిబాబు, ఉండవల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా దేవరకొండ బాలయ్య, రాజవరపు సాంబయ్య, అన్నం శ్రీనివాసరావు, కె.నరసింహారావు, టి.శ్రీనివాసరావు, పోటు శ్రీనివాసరావు, సెక్రటరీలుగా మేకల సుబ్బారావు, నీలం సతీష్‌కుమార్, మాగంటి శ్రీనివాసరావు, మహిళ కార్యదర్శి గోలి ధనలక్ష్మీ, సాంస్కృతిక కార్యదర్శిగా జి.బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్యఅతిధిగా హాజరైన రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బి.రామారావు మాట్లాడుతూ బిసిల ఉద్యోగులంతా ఐకమత్యంతోనే 42 శాతం రిజర్వేషన్‌లు సాదించగలమన్నారు. పొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటి కమీషనర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బిసిల సాధికారిత ప్రశ్నార్ధకమైందన్నారు. అనంతరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మేడపి వెంకట ప్రసాద్, రాష్ట్ర సలహా మండలి చైర్మన్ సాదం వెంకట సత్యన్నారాయణ, గౌరవాధ్యక్షులు పి.వి.రమణయ్య మాట్లాడారు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానాలను ఆమోదించారు.



నూతన కార్యవర్గం

26న ప్రజల వైద్యుడు హనుమంతరావు గ్రంథావిష్కరణ సభ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల వైద్యుడు డాక్టర్ ముద్దన హనుమంతరావు జీవిత సంగ్రహంపై డాక్టర్ వెన్ని శెట్టి సింగారావు రాసిన గ్రంథా విష్కరణ సభ ఈ నెల 26వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక బందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం, శ్రీపద్మావతి కళ్యాణ వేదికపై నిర్వహిస్తున్నట్లు భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షులు బొల్లెపల్లి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం దేవాలయ ప్రాంగణంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ సభకు రాజ్యసభ పూర్వ సభ్యులు డాక్టర్ యలమంచిలి శివాజీ అధ్యక్షత వహిస్తారని, జ్యోతి ప్రకాశనం దేవస్థానం అధ్యక్షులు చిటిపోతు మస్తానయ్య చేస్తారని, విశిష్ట అతిథి పూర్వ పార్లమెంటు శాసనసభ్యులు కరణం బలరామకష్ణమూర్తి, శాసనమండలి పూర్వ సభ్యులు కె.ఎస్ లక్ష్మణరావు పాల్గొంటారని తెలిపారు. అదే విధంగా డాక్టర్ సీతారామయ్య, పారిశ్రామికవేత్త పోలిశెట్టి జ్ఞానదేవ్, సరస్వతి శిశు మందిరాల జిల్లా అధ్యక్షులు వనమా పూర్ణచంద్రరావు, ఏపీ కాటన్ అసోసియేషన్ అధ్యక్షులు కొర్రపాటి రామారావు పాల్గొంటారన్నారు. హనుమంతరావు అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్.మస్తానయ్య, డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు, ఏలూరి సూర్యనారాయణ, ఇరుగులపాటి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

చంద్రవంకలో మృతదేహం

ప్రజాశక్తి - మాచర్ల



స్థానిక జమ్మలమడక రహదారిలోని చంద్రవంకలో మతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల ఏడో తేదీన కూరగాయలు తీసుకునివస్తానని బ్రహ్మయ్య ఇంటి నుండి వెళ్లినట్లు అతను భార్య అమరమ్మ మాచర్ల రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఆదివారం చంద్రవంకలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మతుడు లింగాపురం గ్రామానికి చెందిన బ్రహ్మయ్య అని పోలీసులు నిర్ధారించారు. మృతదేహానికి సంఘటన స్థలంలోనే వైద్యులు పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

యువతి అదృశ్యంపై సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన నగరికంటి నందు ఈనెల 16వ తేదీన ఇంట్లో చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదని తండ్రి ఆనందరావు సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఇంటి నుండి వెళ్లిన సమయంలో ముక్కుపొడి కలర్ ఫుల్ హాండ్స్ టీటీ షర్టు, బ్లూ కలర్ జీన్ ప్యాంటు ధరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు సత్తెనపల్లి రూరల్ సిఐ సెల్ నంబర్ 9440796231, రూరల్ పోలీస్ స్టేషన్ నంబర్ 0841232033కు తెలపాలని పోలీసులు కోరారు.

కోట గ్రామంలో చోరీ



ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని కోట గ్రామంలో చోరీ జరిగింది. షైక్ ఖైరునిసా గత గురువారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి నరసరావుపేటకు వెళ్లారు. శనివారం సాయంత్రం తిరిగి రాగా ఇంట్లోని బంగారు గొలుసు, చెవి దుద్దులు, వెండి పట్టీలు, ఇత్తడి సామాన్లు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలిని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఐదుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - కొల్లిపర

మండలంలోని అత్తోట గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగుర్ని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రూ.7600, 3 సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

ప్రజాశక్తి - పొన్నూరు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఆలూరు గ్రామంలో ఆదివారం ఇంటింటికి తిరుగుతూ సంతకాలను సేకరించారు. వైసిపి మండల అధ్యక్షులు చింతలపూడి మురళీకృష్ణ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న మెడికల్ కళాశాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడానికి కూటమి ప్రభుత్వం సన్నద్ధమైందని, దీన్ని సహించబోమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.నాగేశ్వరావు, షేక్ మౌలాలి, కె.కరుణ్‌బాబు, ఆర్.నరేంద్ర, ఆర్.భాగ్యరాజు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉన్నతంగా తీర్చిదిద్దాలి

- పదో తరగతిలో వినుకొండ విద్యార్థి పల్నాడు జిల్లా ఫస్ట్ వస్తే రూ.5 లక్షలు
- వివిధ విభాగాల్లో ఫలితాల ఆధారంగా నగదు ప్రోత్సాహకాలు
- నూతన ఉపాధ్యాయుల సన్మాన సభలో జీవీ ఆంజనేయులు



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

విద్యార్థులను ఆదర్శ భావాలతో గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించాల్సిన బాధ్యత గురువులపై ఉందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా నియమితులైన వినుకొండ నియోజకవర్గంలోని నూతన టీచర్స్‌ను ఆదివారం చీఫ్‌విప్ కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటు చేయగా జీవీ ఆంజనేయులు మాట్లాడారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, బిఆర్ అంబేద్కర్ లాంటి ఎంతోమంది గొప్ప వ్యక్తులను తీర్చిదిద్ది సమాజానికి అందించింది గురువులేనని గుర్తు చేశారు. విద్యార్థుల్లో నైతిక విలువలతో పాటు వ్యక్తిత్వాన్ని, సామాజిక బాధ్యతను పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. బాధ్యతాయుతమైన ప్రవర్తనను విద్యార్థులకు బోధించాలని కోరారు. విద్యతో పాటు క్రీడలు, పాఠ్యేతర కార్యక్రమాలలో రాణిస్తూ పట్టుదల వంటి విలువలను నేర్పించాలన్నారు. సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి భావాలను కలిగించాలని కోరారు. నాడు గోల్డ్ మెడలిస్టులో కూడా ఎంతోమంది ఆత్మహత్యలకు గురవుతున్నారని, విద్యార్థుల్లో మానసిక శక్తిని పెంచి జీవితంలో గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దాలని సూచించారు. తాను గురువులు చూపిన మార్గంతోనే ఈ స్థానికి వచ్చానన్నారు. సమాజ సేవ చేసేందుకు తాను రాజకీయాల్లోకి వచ్చానని, పేదరిక నిర్మూలనలో భాగంగా సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన పి4 ద్వారా తాము 100 కుటుంబాలను దత్తత తీసుకున్నానని చెప్పారు.

10వ తరగతిలో ఫస్ట్ వస్తే రూ.5 లక్షల రివార్డు

2025-26 విద్యా సంవత్సరం పదో తరగతి నందు వినుకొండ నియోజకవర్గంలోని జెడ్‌పి హైస్కూల్ నుండి విద్యార్థి పల్నాడు జిల్లా ఫస్ట్ సాధిస్తే ఆ విద్యార్థికి శివశక్తి ఫౌండేషన్ ద్వారా రూ.5 లక్షల నగదు ప్రోత్సాహకం అందిస్తామని జీవీ ఆంజనేయులు ప్రకటించారు. పల్నాడు జిల్లాలో ఏ ప్రభుత్వ హైస్కూల్ నుండి పదో తరగతిలో జిల్లా ఫస్ట్ విజయం సాధించిన విద్యార్థికి రూ.2 లక్షలు ఇస్తామన్నారు. వినుకొండ నియోజకవర్గంలో ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల వారిగా విద్యార్థులు అధిక శాతం ప్రతిభను ఘనపరిస్తే ఆ సబ్జెక్టు టీచర్ను ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి రూ.లక్ష ఇస్తామని చెప్పారు. వినుకొండ నియోజకవర్గం విద్యలో రాష్ట్రస్థాయినందు ప్రథమ స్థానంలో నిలవాలని, విద్యార్థులను మంచి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, నిశంకర్రావు శ్రీనివాసులు, వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళి, ఎంఈఓ జఫ్రుల్లా ఖాన్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్త : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



దీపావళి పండుగను పల్నాడు జిల్లా ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. దీపావళి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. బాణసంచా కాల్చే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్న పిల్లల పక్కనే పెద్దలుండాలని సూచించారు. పర్యావరణ కాలుష్య రహిత, ప్రజాహిత, ప్రజలకు ఇబ్బందులేని పండగ జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేటి స్పందన రద్దు

దీపావళి పండుగ ప్రభుత్వ సెలవు దినం సందర్భంగా ప్రతి సోమవారం జరగనున్న ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తునట్లు కలెక్టర్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.



లాంచీ స్టేషన్‌ను సందర్శించిన పర్యాటక శాఖ డివిఎం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

స్థానిక లాంచీ స్టేషన్‌ను పర్యాటక శాఖ విజయవాడ డివిజనల్ మేనేజర్ చైతన్య ఆదివారం సందర్శించారు. లాంచీలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ లాంచీల్లో సందర్శకుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అనంతరం ఉద్యోగులతో సమావేశమయ్యారు. హరిత రిసార్ట్ మేనేజర్ మస్తాన్‌బాబు, ఎత్తిపోతల మేనేజర్ యల్లాల బ్రహ్మం, వినయతుల్లా, దత్తు, పులుసు వీరారెడ్డి పాల్గొన్నారు.



30 కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సత్తెనపల్లి : పట్టణానికి చెందిన గుండవరపు వెంకటరావు జ్ఞాపకార్థం కుమారుడు అనిల్ కుమార్ (ఎన్‌ఆర్ఐ) సామాజిక సేవా కార్యకర్త గంజి వీరాస్వామి ఆధ్వర్యంలో 30 కుటుంబాలకు ఆర్థిక సహాయం నిత్యవసరుకులను ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక ఫణిదం చేనేత సొసైటీ ఆవరణలో జరిగిన కార్యక్రమానికి సొసైటీ అధ్యక్షులు కె.శివదుర్గరావు అధ్యక్షత వహించగా వీరాస్వామి మాట్లాడుతూ అనిల్ కుమార్ మిత్రులు గోగినేని శివరామకృష్ణ పెద్దకర్మ సందర్భంగా అనిల్ కుమార్ ఆర్థిక సహాయంతో ఒకొక్కరికి రూ.5 వేల చొప్పున ఐదుగురికి ఆర్థిక సాయం అందించారన్నారు. ఊటుకూరి ఉషారాణి జ్ఞాపకార్థం సోదరుడు సతీష్ రూ.7 వేలు సమకూర్చగా అన్నదానం చేశారు. ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య మాట్లాడుతూ దాతల సహకారంతో వీరాస్వామి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కె.చిననాగేశ్వరరావు, జి.కళ్యాణ్, జి.సోమనాథ్, సిపిఎం నాయకులు జి.చలమయ్య, ఆర్‌ఎంపి బి.నాగరాజు, న్యాయవాది డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : ఉద్యోగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. సిఎం చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగస్తులు కొరకు కొత్తగా 3.64 శాతం డిఎ ప్రకటించారని, పెండింగ్లో ఉన్న రూ.7000 కోట్లు డిఎ బకాయిలను త్వరలో విడుదల చేయనుందని చెప్పారు.



ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఘంకార్ దీపావళి ఉత్సవ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దేశ సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీకగా పండుగలు నిలుస్తాయని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ నాగోతు ప్రకాశరావు అన్నారు. నరసరావుపేట మండలం కేసానుపల్లిలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ఘంకార్ దీపావళి ఉత్సవ్-2025ను ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాశరావు, డైరెక్టర్ నాగోతు సబిత, ప్రిన్సిపాల్ రేఖా ఫులేకర్ హాజరై, విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు డ్యాన్సీ డివా, గ్లామరస్ గర్బా కపుల్, రిథం రాయల్స్, సింగింగ్ స్టార్ కరోకే, బెస్ట్ స్టాల్ వంటి విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థులు నిర్వహించిన బయ్-సేల్ ఎక్స్‌పీరియన్స్ ఉత్సవానికి సృజనాత్మకత, వ్యాపారాత్మకతను చేర్చింది. అనంతరం చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాశరావు మాట్లాడుతూ తమ విద్యార్థులు రంగస్థలాన్ని స్ఫూర్తిదాయకంగా మార్చి తమ ప్రతిభ, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను అద్భుతంగా ప్రదర్శించారన్నారు. దీపాలు, సంగీతం, డ్యాన్స్, దాండియా, స్నేహభావంతో కూడిన ఈ ఉత్సవం విద్యార్థుల అభ్యున్నతికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు.

మహిళా కబడ్డీ పోటీల్లో కృష్ణవేణి జట్టు విజయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళా కబడ్డీ పోటీల్లో తమ కళాశాల జట్టు ప్రథమ స్థానం సాధించినట్లు కృష్ణవేణి కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఈనెల 16,17 తేదీలలో లాం లోని చలపతి ఫార్మసీ కాలేజ్‌లో నిర్వహించిన అంతర కళాశాలల మహిళా కబడ్డీ పోటీల్లో తమ కళాశాల జట్టు ప్రతిభ చూపిందన్నారు. కోడెల సంజీవయ్య పేరు మీద ఉన్న ఎఎన్‌యు మహిళా కబడ్డీ రోలింగ్ ట్రోఫీని ఇది వరుసగా రెండవసారి కైవసం చేసుకోవడమని చెప్పారు. ఈ టోర్నమెంట్ లో భాగంగా ఎంపిక చేసిన ఎఎన్‌యు మహిళా కబడ్డీ జట్టును తమ కృష్ణవేణి కళాశాలకు చెందిన ఎం.త్రివేణి, ఎం.కావేరి, ఎల్.లక్ష్మీదేవి, డి.కృష్ణశ్రీ ఎంపికయ్యారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఈదర ఆదిబాబు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29 నుంచి చెన్నైలోని వినాయక మిషన్ రీఛార్జ్ ఫౌండేషన్‌లో జరగనున్న సౌత్‌జోన్ మహిళా కబడ్డీ పోటీలలో పాల్గొంటారని చెప్పారు. ఎంపికైనవారిని డైరెక్టర్ కె.నాసరయ్య, కె.వీర రాఘవులు, ప్రిన్సిపల్ ఎన్.వెంకటేశ్వర్లు, అకడమిక్ డైరెక్టర్ డి.యోగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ ఎం.ఆర్.కె.సతీష్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ ఈదర ఆదిబాబు, పిఈటి సయ్యద్ మహమ్మద్ అభినందించారు.



సిఐటియు ముప్పాళ్ల మండల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ముప్పాళ్ల

సిఐటియు మండల మొదటి మహాసభ మండల కేంద్రమైన ముప్పాళ్లలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ మహాసభకు యర్రంశెట్టి సుబ్బారావు అధ్యక్షత వహించారు. పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హరిపోతురాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని, కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను తొలగించి వాటి స్థానంలో లేబర్ కోడ్లను ప్రవేశపెట్టాయని విమర్శించారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఉన్నప్పటికీ ఆ నిధులన్నీ ఇతర సంక్షేమ కార్యక్రమాలకు వినియోగిస్తూ భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. భవన నిర్మాణ యజమానుల ద్వారా సెస్ రూపంలో వచ్చిన రూ.కోట్లను కార్మికులకు దక్కకుండా చేస్తున్నాయన్నారు. రవాణా రంగంలో పెను మార్పులు తీసుకొస్తూ ప్రమాదాలు తగ్గిస్తామని చెబుతున్న ప్రభుత్వం ప్రమాదాలు తగ్గించలేకపోగా రవాణా రంగా కార్మికులపై పెను భారాలు వేస్తున్నట్లు చెప్పారు. ఆటో డ్రైవర్లకు ఇస్తున్న రూ.15 వేలను రూ.30 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వివిధ రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలని, ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. హక్కుల రక్షణ కోసం సాగే అన్ని ఉద్యమాలు, పోరాటాల్లో కలిసి రావాలన్నారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ, కౌలురైతు సంఘం మండల కార్యదర్శి టి.అమరలింగేశ్వరరావు సౌహార్ధ సందేశమిచ్చారు.

నూతన కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా యర్రంశెట్టి సుబ్బారావు, కో-కన్వీనర్‌గా చింతపల్లి నాగమల్లేశ్వరరావు, సభ్యులుగా దారా చిన్నారావు, తిరుపతి ఏడుకొండలు, టి.అంకమ్మ, కోటయ్య, ఏసుబాబు, పుల్లారెడ్డి ఎన్నికయ్యారు.



రాజధాని ప్రాంతం మందడంలో రాత్రి వేళ గ్రామసభ సందర్భంగా మంచినీరు అందిస్తున్న పారిశుధ్య కార్మికులు..

పని ఒత్తిడిలో...
రాజధాని పారిశుధ్య కార్మికులు

పర్యటనలకు.. సమావేశాలకు 'ముందుగా రావాలి.. ముగిసేవరకూ ఉండాలి..

ప్రజాశక్తి - తుళ్లూరు

'రాత్రి 6 గంటలకు సిఆర్‌డిఎ కమిషనర్ వస్తున్నారు. రైతులతో మీటింగ్ ఉంది..ముందే అక్కడకు వెళ్లి అన్ని ఏర్పాట్లు చేయండి.. ప్రపంచ బ్యాంకు బృందం వస్తోంది. మీరు రెండు గంటలు ముందే వచ్చి ఏర్పాట్లు చేయాలి.. 'రాజధానిలో పారిశుధ్య కార్మికులకు అధికారుల నుంచి వచ్చే ఆదేశం ఇది. ఎప్పుడు, ఎక్కడ మీటింగ్ జరుగుతుందో.. ఎప్పటివరకు ఉంటుందో తెలియదు. పని వేళ ముగిసినా అధికారులు చెప్పినట్లు చేయాల్సిందే. మీటింగ్ పూర్తయ్యే వరకు కార్మికులు ఉండి తీరాల్సిందే. రోజంతా పారిశుధ్య విధులు నిర్వర్తించిన కార్మికులకు ఇది అదనపు పని. ఈ అదనపు పనికి.. అదనంగా డబ్బులు ఇవ్వరు.. 'రాజధానిలో సమావేశాలు, పర్యటనలు జరిగినా, ముందుగా వచ్చేది.. చివరి వరకు ఉండేది పారిశుధ్య కార్మికులే. సమావేశం ప్రారంభానికి ముందే వచ్చి చెత్తా చెదారం ఏరివేయడం, ఊడ్వడం, కుర్చీలు వేయడం, వేదికపై కూడా కుర్చీలు, బల్లలు వేయడం, చివరకు బ్యానర్లు కట్టడం లాంటి పనులను పారిశుధ్య కార్మికుల చేత చేయిస్తున్నారు. సమావేశాలకు వచ్చే వారికి అల్పాహారం, టీ, తాగునీరు కార్మికులు అందిస్తారు. సమావేశం పగలైనా, రాత్రయినా ముగిసేవరకు ఉండాల్సిందే. సమావేశాలకు ముందుగా వచ్చి అందరికన్నా చివరిగా వెళ్ళేది పారిశుధ్య కార్మికులే..' రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులు పని ఒత్తిడితో సతమతమవు తున్నారు. రాజధాని గ్రామాలకు విఐపి, వివిఐపిలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రాజధాని నేపథ్యంలో నిత్యం ఏదో ఒక సమావేశం జరుగు తుంది. ఒక్కోసారి రాత్రి పొద్దు పోయే వరకు కొనసాగు తాయి. అధికారుల సమావేశాలకు మాత్రమే కాదు.. ప్రజాప్రతినిధులు వస్తున్నారన్నా పారిశుధ్య కార్మికులకు పిలుపు వస్తుంది. దళితులు, బలహీన వర్గాలకు చెందిన కార్మికులు ఎదురు చెప్పలేక వారికి కేటాయించిన పారిశుధ్య విధులను పగలు, రాత్రి అని లేకుండా నిర్వర్తించాల్సిన ఆగత్యం ఏర్పడుతోంది. స్థానికంగా ఉండేవారితో పాటు రాజధాని నిర్మాణం నేపథ్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు రాజధాని గ్రామాల్లో ఉంటున్నారు. దీంతో రాజధానిలో పారిశుధ్యం ప్రాధాన్యత మరింత పెరిగింది. అయినప్పటికీ ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారులు అవసరానికి అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచడం లేదు. జీతాలు పెంచకపోగా సక్రమంగా చెల్లించక పోవడం, పెండింగ్ పెట్టడం, ఆందోళన చేస్తేనే జీతాలు చెల్లించడం, రక్షణ పనిముట్లు అందించక పోవడం తదితర కారణాల రీత్యా విసుగు చెంది కార్మికులు పనులు మానేసి వెళ్లిపో తున్నారు. రాజధాని ప్రకటన అనంతరం 300 కు పైగా కార్మికులు ఉంటే ప్రస్తుతం 150మంది మాత్రమే ఉన్నారని పారిశుధ్య కార్మికులు చెబుతున్నారు. 11 ఏళ్ల క్రితం జీతం రూ 12 వేలు కాగా ఇప్పటికీ అదే జీతం తప్ప పెరిగిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు పారిశుధ్య కార్మికుల కాళ్ళు కడిగి నెత్తిన పోసుకోవడమే తప్ప బాగోగుల సంగతి పట్టించుకోరని బాధను వెలిబుచ్చుతున్నారు..

ప్రతి నెలా ఒకటవ తేదీన జీతం చెల్లించాలి..

పారిశుధ్య కార్మికులకు ప్రతినెలా ఒకటవ తేదీన జీతాలు చెల్లించేలా ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారులు చర్యలు తీసుకోవాలని రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం.రవి అన్నారు. రెండు, మూడు నెలలు జీతాలు పెండింగ్ పెట్టడం, ఆందోళన చేస్తే దానం చేసినట్లు ఒక నెల జీతం మాత్రమే చెల్లించడం అధికారులకు అలవాటుగా మారిందని ఆయన అన్నారు. జీతం అడగడం కార్మికుల హక్కని, భిక్ష కాదన్న సంగతి అధికారులు తెలుసు కోవాలన్నారు. పారిశుధ్య కార్మికులకు జీతం వస్తేనే కుటుంబాలు గడుస్తాయని, నెలల తరబడి జీతాలు ఇవ్వక పోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. రాజధానిలో కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు. అదనంగా పనులు చేయిస్తున్నారని అన్నారు. కార్మికుల సంఖ్య పెంచకుండా విధులు నిర్వర్తిస్తున్న కొద్దిమంది కార్మికులను పని ఒత్తిడికి గురిచేస్తున్నారని అన్నారు. కార్మికుల సంఖ్యను పెంచాలని సిఐటియు, రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం మాత్రమే కాకుండా రాజధాని రైతులు కూడా పలు సమావేశాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులకు విజ్ఞప్తి చేశారని రవి గుర్తు చేశారు. కార్మికులకు జీతం రూ 21 వేలు ఇవ్వాలని, రక్షణ పరికరాలు అందజేయాలని, ఆప్కాస్‌లో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లడం జరిగిందని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రవి డిమాండ్ చేశారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

సోలా ముత్యాలరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి- తాడేపల్లి

భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్‌ఐ) నాయకునిగా ప్రజా జీవితంలో తన ప్రస్థానం మొదలుపెట్టి వ్యవసాయ కార్మిక సంఘం, గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం తదితర ప్రజాసంఘాలలో కీలకంగా పనిచేసిన సోలా ముత్యాలరావు సేవలు మరువలేనివని సిపిఎం సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ముత్యాలరావు ప్రథమ వర్ధంతి సభ ఆదివారం తాడేపల్లి మేక అమరా రెడ్డి భవన్‌లో నిర్వహించారు. పోలకంపాడు ఎంపీటీసీ సభ్యులుగా చేశారని కొనియాడారు. ఆ ప్రాంతంలో అప్పటి శాసనసభ్యులు నిమ్మగడ్డ రామ్మోహనరావు కృషితో ప్రజల ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇప్పించడంలో ముత్యాల ముత్యాలరావు కృషి ఆమోఘమన్నారు. తొలుత ముత్యాలరావు చిత్రపటానికి శ్రీనివాస్ కుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గాదె సుబ్బారెడ్డి, డి.విజయబాబు, కె.బాబు రావు, బి.దశధరామిరెడ్డి, ఎం.శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి, డి.వి,భాస్కర్‌రెడ్డి, ఎం.డి.బాబ్జి, నారిన నాగేశ్వరరావు, ఎస్.కె బాషా, కె.కరుణాకర్ రావు, మేరీ, డి.యోహన్ పాల్గొన్నారు.

హేతువాద సాహిత్య పితామహుడు త్రిపురనేని

ప్రజాశక్తి - గుంటూరు

తెలుగునాట హేతువాద సాహిత్యానికి పునాదులు వేసిన వ్యక్తి త్రిపురనేని రామస్వామి చౌదరి అని ప్రముఖ సాహిత్య విమర్శకుడు జి. లక్ష్మీ నరసయ్య అన్నారు. బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆదివారంకవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార ప్రదాన సభ జరిగింది. రామస్వామి సాహిత్యానికి వారసుడు కోయి కోటేశ్వరరావుకు, రామస్వామి సామాజిక సంస్కరణ ఉద్యమానికి వారసుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లుకు రామస్వామి పురస్కారాలు ఇవ్వడం సముచితమని అన్నారు. సభకు మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. సభలో మరో ముఖ్య అతిథి విశ్రాంత ఐ.ఎఎస్ అధికారి పీవీ రమేష్ మాట్లాడుతూ వందేళ్ల క్రితం సమాజంలో ఉన్న అసమానతల మీద తిరుగుబాటు సాహిత్యం రచించిన వ్యక్తి త్రిపురనేని రామస్వామి అని అన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ తెలుగునాట బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం ప్రారంభించింది రామస్వామి అని అన్నారు. అనంతరం కోయి కోటేశ్వరరావు, ఆలా వెంకటేశ్వర్లుకు త్రిపురనేని రామస్వామి పురస్కారాలు ప్రదానం చేసి వారిని ఘనంగా సత్కరించారు. సభలో ప్రముఖ విద్యావేత్త కన్నా మాస్టారు, డాక్టర్ అంబేద్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరరీ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్, డాక్టర్ మూకిరీ సుధ తదితరులు ప్రసంగించారు.

బాణసంచా విక్రేతల్లో వాన భయం



బాణసంచా అమ్మకాలు..

ప్రజాశక్తి - తుళ్లూరు

బాణసంచా విక్రయ దారులను వర్ష భయం వెంటాడుతోంది. లక్షల రూపాయలు హెచ్చించి అమ్మకాలకు సిద్ధం చేసిన బాణసంచా సామగ్రి వర్షం వల్ల తడిచి పోతోందని ఆందోళన చెందుతున్నారు. తుళ్లూరు పరిసర గ్రామాల్లో ప్రధాన సెంటర్‌లలో బాణసంచా విక్రయాలు మొదలయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో విక్రయ దారులు అవస్థలు పడ్డారు. పగలు వర్షం కురవక పోవడంతో కొంత కుదుటపడ్డారు. కొద్దిపాటి వర్షం కురిసినా బాణసంచా అమ్మకాలపై ప్రభావం పడుతుందని, నష్టపోవాల్సివస్తుందని అంటున్నారు. 500 నుంచి 10 వేలు, కొంతమంది అంతకుమించి కొనుగోలు చేస్తారని, వర్షం వస్తే పరిమితంగా కొనుగోలు చేస్తారని అంటున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఇళ్లల్లో ఉంచి అమ్మకూడదనే నిబంధనలకు అనుగుణంగా సురక్షిత ప్రదేశాలలో టెంట్‌లు వేసి అమ్మకాలు సాగిస్తున్నామని చెబుతున్నారు.

పురమిత్ర యాప్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గుంటూరు

పురపాలక సేవలను సులభతరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పురమిత్ర యాప్‌ని అందుబాటులోకి తెచ్చిందని, నగర ప్రజలు ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పురమిత్ర యాప్ ద్వారా ప్రజలు మున్సిపల్ సేవలు, ఫిర్యాదులు, పన్ను చెల్లింపులు, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు వంటి దాదాపు 122 రకాల పురపాలక సేవలు పొందవచ్చన్నారు. సమస్యలను ఫిర్యాదుతోపాటు ఫోటోలను కూడా అప్‌లోడ్ చేయవచ్చన్నారు. వీధిదీపాలు, చెత్త పేరుకుపోవడం, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అంశాలపై ఫిర్యాదులు, సేవల కోసం దరఖాస్తు, వాటి పరిష్కార స్తితిని తెలుసుకోవానికి ట్రాకింగ్ ఉంటుందన్నారు. వచ్చే వారం నుండి వార్డ్ సచివాలయాల వారిగా ప్రజలకు యాప్ డౌన్లోడ్, వినియోగంపై అవగాహన కల్గిస్తామని తెలిపారు.

నీళ్లలో తేలియాడుతున్న పేదల ఇళ్లు



ఇళ్లలోకి చేరిన వర్షపునీరు

ప్రజాశక్తి- తాడేపల్లి

శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు కురిసిన వర్షానికి తాడేపల్లి పట్టణంలోని బోటుయార్డ్ వద్ద గల పేదల ఇళ్లల్లోకి మోకాళ్ళ లోతు వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో పేదలు రాత్రంతా ముని కాళ్ళపై నిలబడాలి చేస్తుందని వాపోయారు. ఇటువంటి దుస్థితి పగ వాడికూడ రాకూడదు అని చెబుతున్నారు. పగలంతా కాయ కష్టం చేసి, ఇంటికి వచ్చి కాస్తంత సేదదీరుదామంటే, ఇంటిని ముంచెత్తిన వర్షపు నీటిని బకెట్లతో బయటికి తరలించడంతో సరిపోయిందని వాపోతున్నారు. మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మా ప్రాంతంలో ఉన్న పేదలు బాధలు తీరేది ఎప్పుడు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కార్మికుల శ్రమను దోచేస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - తాడేపల్లి

కార్మిక వర్గం శ్రమను పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా దోచి పెట్టడానికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలులు పనిచేస్తున్నాయని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు విమర్శించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలోతొక్కి, ఎనిమిది గంటల పని విధానాన్ని 13 గంటలుగా మార్చటం కార్మిక వర్గానికి ద్రోహం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకాష్ నగర్‌లోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం సిఐటియు పట్టణ కమిట, ఆహ్వానితుల విస్తృత సమావేశం తమ్మిశెట్టి వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ కార్మిక వర్గ హక్కుల్ని కాపాడుకోవడం కోసమే రానున్న రోజుల్లో ఆలిండియా మహాసభలు విశాఖపట్నంలో జరగబోతున్నాయని చెప్పారు. సిఐటియు మహాసభలను జయప్రదం చేయడానికి మనందరం పెద్ద ఎత్తున కృషి చేయాలని, ఆర్థిక వనరులు సమకూర్చాలని, అందుకోసం ప్రతి రంగంలోని ప్రతి కార్యకర్త, సమయం ఇచ్చి పని చేయాల నీ కోరారు. ఈ సందర్భంగా కృష్ణ నగర్ జోన్ సిఐటియు సమన్వయ కమిటీ కన్వీనర్‌గా తమ్మిశెట్టి వేణుగోపాల్ ఎన్నుకున్నారు. అంగన్‌వాడీ ఆశ మున్సిపల్ ఎంబుక్కు ఆటో భవనిర్మానం ఎసిసి రంగాల కార్మికులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సిఐటియు నాయకులు బూరగ వెంకటేశ్వర్లు మాట్లాడారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నారిన నాగేశ్వరరావు, కె.బాబురావు, పట్టణ కార్యదర్శి పి.సంతోషం, రేణుక, సూరిబాబు, దామరపు నాగేశ్వరరావు, అంకయ్య, సాంబయ్య, ఎ.శబరి, ఎన్.దుర్గారావు, వి.శాస్త్రి, ఎస్.కె.జానీ పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగం శాశ్వత స్ఫూర్తి : డిఐజి

ప్రజాశక్తి - మంగళగిరి

పోలీస్ అమరవీరుల త్యాగం శాశ్వత స్ఫూర్తి అని డీఐజీ పకీరప్ప కాగినేలి అన్నారు. ఆదివారం మంగళగిరి ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం రిహార్సల్ పేరేడ్ను ఆయన పోలీసు ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరో బెటాలియన్ మైదానంలో జరిగిన పోలీస్ అమరవీరుల సంస్కరణ దినం పురస్కరించుకొని నిర్వహించిన స్మృతి పెరేడ్ రిహార్సల్ కార్యక్రమం ఘనంగా జరిగింది. పోలీస్ అమరవీరుల త్యాగం అమూల్యం, దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్ల స్ఫూర్తిని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది మదిలో నాటుకోవాలని అన్నారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ సంస్కరణ దినం పోలీసుల విధి నిష్ఠ ధైర్యం, త్యాగం వంటి విలువలను గుర్తు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐపిఎస్ అధికారిని మల్లికా గార్గ్, డీసీపీ సరిత, జిల్లా అదనపు ఎస్పీలు జీవి రమణమూర్తి, ఏటీవీ రవికుమార్ , సుప్రజ, హనుమంతు, డీఎస్పీలు, సీఐలు, ఆర్ ఐ లు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలో నానాటికి పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను కట్టడి చేయటానికి నూతనంగా నిర్మించిన 167 ఏ జాతీయ రహదారిని ఉపయోగించుకోవాలని కంజ్యూమర్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు ఆదివారం పట్టణ సిఐ పి.రమేష్ బాబును కోరుతూ ఎరహంతుల్లా ని కలిసి వినతి పత్రం అందించారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని గడియార స్తంభం నుంచి కొద్ది దూరంలోనే 167 ఏ రహదారి అందుబాటులోకి వచ్చిందని, రహదారికి అందుకు వెళ్లే మార్గాలను ఒకసారి పరిశీలించి వాహనాల రాకపోకలను మళ్లించినట్లయితే కొంత మేరకు అయినా ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టవచ్చునని వారు పట్టణని కోరారు. వినియోగదారులు సంఘం ఇచ్చిన విజ్ఞప్తిని పరిశీలిస్తామని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్ర మంలోజిల్లా అధ్యక్షులు మురికిపూడి ప్రసాద్, కార్యదర్శి రవి నాయక్, కోశాధికారి బేబీ విక్రమ్, సహాయ కార్యదర్శి గాలయ్య పాల్గొన్నారు.


వినతిపత్రం అందేస్తున్న నాయకులు

పాడి రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని లగడపాడు గ్రామంలోని సంఘం డైరీ మిల్క్ కలెక్షన్ సెంటర్ నందు పాల ఉత్పత్తిదారులకు ఆదివారం బోనస్ పంపిణీ చేశారు.మొత్తం 33 మంది రైతులకు గాను 1,01,418 రూపాయలు నగదు అందించారు. ఈ కార్యక్రమంలో మిల్క్ కలెక్షన్స్ సెంటర్ అధ్యక్షులు బత్తుల కోటేశ్వరరావు, సంగం డైరీ మేనేజర్ గోపి, సూపర్ వైజర్ కోటేశ్వరరావు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న అధికారులు

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి - మాచర్ల

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ముందు రావలని ఎక్స్ డిప్యూటీ డిఇఓ జి.రామకృష్ణ అన్నారు. శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం భాగంగా స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు పెన్షనర్స్ అసోసియేషన్ బిల్డింగ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో ప్రతి ఆదివారం శుభ్రపరిచే కార్యమకాని శ్రీరామకృష్ణ సేవా సమితి సభ్యులు శుభ్రపరిచే కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ సెక్రటరీ అందువలన చంద్రయ్య, రిటైర్డ్ హెచ్ఎం .పాపి రెడ్డి, శ్రీహరి బాబు, రామాంజి, వై.నాగశంకర్ రెడ్డి, గుంటూరు ప్రభావతి, సిహెచ్. రుక్మిణి, ఏ. రాజేశ్వరి, పి. సైదమ్మ, సిహెచ్. వినయ్ కుమార్, ఏ.వెంకయ్య, ఎం. సురేంద్ర, పి. అజయ్ కఅష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల పునరుద్ధరణ

ప్రజాశక్తి - విజయపురిసౌత్


మాచర్ల మండలం తాళ్లపల్లి పంచాయతీ ఏడో మైలు గ్రామంలో వీధి దీపాలను తాళ్లపల్లి సర్పంచి దేరంగుల కోటేశ్వరరావు ఆదివారం పునరుద్ధరణ చేశారు. ఇటీవల ఏడవమెయిలు గ్రామంలో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు గురి కావడంతో విషయం తెలుసుకున్న సర్పంచి దీపావళి పండుగను పురస్కరించుకొని వీధి దీపాలను పునరుద్ధించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు


వీధి దీపాలు ఏర్పాటు

ఉచిత వైద్యసేవ మహోన్నతమైనది : ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం ఒక మహోన్నతమైన సేవ అని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మానుకొండ కళ్యాణ మండపంలో లక్ష్మణ్ ఆర్థో కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం వైద్యానికి పెద్ద పేట వేస్తుందన్నారు. మాచర్ల ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ అయితే అన్ని వర్గాల వారికి మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పాలడుగు లక్ష్మీనారాయణ, మాచర్ల మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు, మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ రాజబోయిన మల్లేశ్వరిమధు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, సైదయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షులు వజ్రం నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

జన్నాభట్ల లక్ష్మీనారాయణ మృతి నాటక రంగానికి తీరని లోటు


నివాళులర్పిస్తున్న కళావేధిక సభ్యులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రంగస్థల నటులు, సంస్కృతాంధ్ర పండితుడు జన్నాభట్ల లక్ష్మీనారాయణ మృతి నాటక రంగానికి తీరని లోటని నరసరావుపేట వ్యవస్థాపక అధ్యక్షులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని కళావేదిక భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సంతాప సభ ఏర్పాటు చేశారు. పొన్నపాటి, శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ రామిరెడ్డి మాట్లాడుతూ నిరంతరం కళా శ్రామికుడని,తోటి కళాకారులకు ఆయన స్ఫూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న కళావేదిక సభ్యులు, కళాకారులు లక్ష్మీ నారాయణతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కళా వేదిక సభ్యులు యన్నం వెంకట నర్సిరెడ్డి, డాక్టర్ రత్నాకరం రాము, పి.వి.ఎస్.ఆర్ ప్రసాదరావు, సినీ నటులు చంద్రశేఖర్, గంధం యజ్ఞ వలక్యశర్మ, కె.నాగరాజు శర్మ, సింగరయ్య చౌదరి, బత్తుల మురళి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల్ని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం స్వయంగా లబ్ధిదారులకు ఆదివారం అందచేశారు. 34 మంది లబ్ధి దారులకు రూ.25.31 లక్షల విలువైన చెక్కుల్ని, మరో ఇద్దరికి రూ.2.30 లక్షల విలువైన ఎల్.వో.సీలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభు త్వం పేదల ఆరోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యమిస్తోందని, రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం త్వరలోనే సంజీవని పథకం అమల్లోకి తీసుకురానుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివ రావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, ప్రధాన కార్యదర్శి మాద్దుమల రవి, మురకొండ మల్లిబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

1982-83 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్థానిక లూథరన్ హైస్కూలు 1982-83 పూర్వ విద్యార్థుల 3వ అపురూప ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో 50 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థినిలు కొండా శోభారాణి, దేవరపల్లి సంధ్యా, జలసూత్రం అనురాధలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాడు స్కూల్‌లో గడిపిన తిపి గుర్తులను గుర్తు చేసుకొని మురిసిపోయారు. ప్రతి ఏటా తామందరం ఇలానే కలుసుకోవాలని వాగ్దానం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొందిలి శ్రీనివాస్ సింగ్, కుందా సురేష్, ఏసుదాసు, ఏడుకొండల, పూవ్వాడ వెంకటేశ్వర్లు, జి.వి.ఆర్. సురేష్, ఎం. విజయకుమార్, లాల్, భాషా, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సు విజయవంతం చేయండి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

రాష్ట్ర ప్రభుత్వం బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఈనెల 24వ తేదీన విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో జరగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పలువురు కోరారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఎంసిపిఐ పార్టీ కార్యాలయంలో కరపత్రాన్ని పిడియం అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, సభ్యులు దావీదు, ఎంసిపిఐ రాష్ట్ర నాయకులు అబ్రహం లింకన్, బీసీ నాయకులు శివలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కరేడు ప్రాంతంలో ఇండో సోలార్ విద్యుత్ ప్లాట్‌కి వేలాది ఎకరాలు సారవంతమైన పచ్చని పంట పొలాలు బలవంతంగా స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ ప్రజలు పోరాడుతున్నారని, రాష్ట్ర సదస్సులో ప్రారంభకులు రైతు స్వరాజ్య వేదిక నాయకులు వడ్డే శోభనాదేశ్వర రావు, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి. ప్రసాద్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుక చంద్రశేఖర్, పిడియం రాష్ట్ర కార్యదర్శి కె.వెంకటేష్, పలాస కార్గో ఎయిర్‌పోర్టు పోరాట కమిటీ కన్వీనర్ వాసు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు.



కరపత్రాలు అవిష్కరిస్తున్న

హరిత దీపావళి నిర్వహిద్దాం

ప్రజాశక్తి - మాచర్ల

దీపావళి పండుగను హరిత దీపావళిగా జరుపుకోవాలని పల్నాడు జిల్లా ఎపి.ఎన్.జి.సి. కోఆర్డినేటర్ ఆయేషా సుల్తానా ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. హరిత దీపావళి అంటే పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుతూ పండుగ జరుపుకోవడమని, ఎక్కువ శబ్దం వచ్చే పటాసులు కాల్చకుండా దీపాలు, కొవ్వొత్తులు వెలిగించచాలన్నారు. పశు పక్షాదులు బాణా సంచా శబ్దాలకు ప్రమాదం బారిన పడతాయన్నారు.

హామీని నిలబెట్టుకున్న సిఎం

ప్రజాశక్తి - మాచర్ల

వడ్డెరలకు లీసు ప్రీమియంలో రాయితీ, మైనింగ్ లీజులో 15శాతం రిజర్వేషన్ కల్పిస్తూ టిడిపి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వడ్డెర సంఘ నాయకులు, టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంఘ కార్పొరేషన్ డైరెక్టర్, మాచర్ల పట్టణ టిడిపి అధ్యక్షులు కొమెర దుర్గారావు, కొమెర అనంతరాములు, మంజుల వెంకటేశ్వర్లు, ఉప్పుతోళ్ళ కొట్టు వెంకటేశ్వర్లు, దేరంగుల చెన్నకేశవులు, ఉప్పుతోళ్ళ చెన్నకేశవులు, కొమెర శ్రీను, దేరంగుల కాసయ్య, తిరుమలకొండ జమలయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, కొమెర లక్ష్మి, వేముల మంగమ్మ, మంజుల సునీత తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - విజయపురిసౌత్ (రెంటచింతల)

మండల వ్యాప్తంగా వివాహ ఊరేగింపు, పండగలు ఇతర కార్యక్రమాల్లో డీజే వినియోగించాలంటే అనుమతులు తప్పనిసరని ఎస్ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


పర్యటిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

లింగంగుంట్ల పంచాయతీ పరిధిలోని గాంధీనగర్‌లో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పర్యటించారు. ఆ ప్రాంతంలో డ్రైనేజీ కాలవలు లేకపోవడం వలన వర్షపు నీరు ప్లాట్‌ల మధ్యన, రోడ్లపై నిలిచిపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అక్కడి ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రాంతంలో త్వరలో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తానని ఎమ్మెల్యే అరవిందబాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.


జనార్ధన్‌తో మాట్లాడుతున్న జి.వి.ఆంజనేయులు

జనార్ధన్‌కు జీవీ ఆంజనేయులు పరామర్శ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పార్లమెంట్ కార్యాలయ ఇంచార్జ్ గొట్టిపాటి జనార్ధన్ బాబు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ చీఫ్ విప్ వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్‌లోని జనార్ధన్ బాబును ఆదివారం స్వగృహంలో కలిసి పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జనార్ధన్ బాబు త్వరగా కోలుకొని పార్టీకి సేవలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం డెవలప్‌మెంట్ సొసైటీ అడ్వైజర్-స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మాజీ సభ్యులు ఎస్.కె. జిలాని మాలిక్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు ఘన సన్మానం



నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ ఆలపాటి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కుల, మత, వర్ణ, వర్గ వివక్షతలకు తావులేకుండా మారుమూల గ్రామాల్లో సైతం ఉత్తమ విద్యాబుద్ధులను అందించాలన్న ఏకైక లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మెగా డిఎస్సిపై తొలి సంతకం చేశారని కృష్ణ గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక ఆలపాటి నగర్‌లో ఆదివారం నిర్వహించిన నూతన ఉపాధ్యాయుల సన్మాన సభ నిర్వహించారు. ఆలపాటి మాట్లాడుతూ మెరుగైన బోధన విధానాలు ద్వారా భావి భారత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఎంతైనా ఉందన్నారు. 2025 డిఎస్సి ద్వారా నూతనంగా ఉద్యోగ నియామకాలు జరిపి, ఎటువంటి ప్రలోభాలకు తావు లేకుండా ప్రతిభకే పట్టం కట్టిన నాయకత్వం చంద్రబాబు నాయుడు నాయకత్వమన్నారు. నిరుద్యోగులైన పట్టభద్రుల యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లతో కలసి సమాలోచనలు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేయడం హేయమైన చర్య అన్నారు. అనంతరం పట్టణ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కోగంటి రోహిత్ ఆధ్వర్యంలో నూతన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణాధ్యక్షులు మహమ్మద్ ఖుద్దూస్, మండల విద్యాధికారులు మేకల లక్ష్మీనారాయణ, వి జయంతి బాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమికి ధన్యవాదాలు..

ఈ సందర్భంగా నూతన ఉపాధ్యాయుడు పసుపులేటి చిరంజీవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెనాలి ప్రాంతానికి చెందిన నేను పులిపాడు, గురజాల జెడ్పిహెచ్ పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా నియామికం పొందానన్నారు. విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

కొంఒడేటి గార్గి మాట్లాడుతూ నా చిరకాల స్వప్నం నెరవేరిందన్నారు. నాన్న ఓ హెూటల్‌లో పనిచేస్తూ చదివించారని తెలిపారు. డిఎస్సి ద్వారా ఎస్‌జిటి పోస్ట్ కు ఎంపికై వినుకొండ జెడ్పిహెచ్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధుల్లో చేరానని తెలిపారు. ఉత్తమ విద్యావిధానం, బోధనా పద్ధతుల ద్వారా విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



కుర్చీలు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

100 కుర్చీలు బహూకరణ

ప్రజాశక్తి - తాడేపల్లి

స్థానిక అమరారెడ్డి నగర్‌లో నిర్మించిన వీర తెలంగాణ సాయుధ పోరాట వీరనారి అమరజీవి చిట్యాల ఐలమ్మ రజక కళ్యాణమండపానికి రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి 100 కుర్చీలను ఆదివారం అందజేశారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో రోటరీ క్లబ్ ప్రతినిధుల ద్వారా అనేక సమాజ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం అభినంద నియమని కళ్యాణ మండపం కన్వీనర్ వల్లభాపురం వెంకటేశ్వరరావు కొనియాడారు. ఉండవల్లి కళ్యాణ మండపం వద్ద జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్రరావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గ పరిధిలో రోటరీ క్లబ్ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు విద్యార్థిని విద్యార్థులకు సైకిల్ పంపిణీ , దివ్యాంగ వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందజేస్తున్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు శెట్టి రామకృష్ణ, మున్నంగి వివేకానంద రెడ్డి, జొన్న రాజేష్, ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, ఓ. శ్రీనివాసరావు, టి.శివయ్య, పార్థసారథి, వి.మస్తాన్‌రావు, ఓ.చెంచయ్య, సాంబశివరావు, పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండల అధ్యక్షునిగా ఖాసిం పీరా

ప్రజాశక్తి - పెదనందిపాడు



వైఎస్ఆర్‌సిపి మండల అధ్యక్షుడిగా షేక్ ఖాసిం పీరా రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కార్యాలయం ఆదేశాల మేరకు జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదగా నియామక పత్రాన్ని ఖాసిం పీరా అందుకున్నారు. తనవంతుగా పార్టీ బలోపేతానికి కృషిచేసి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు ఖాశింకు అభినందనలు తెలియజేశారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు కదలాలి

ప్రజాశక్తి- తాడేపల్లి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆలంబిస్తున్న విధానాలకు, ముఖ్యంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు కదలాలని వైఎస్ఆర్‌సిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బురముక్కు వేణుగోపాల సోమిరెడ్డి కోరారు. ఆదివారం తాడేపల్లి పట్టణంలోని మున్సిపల్ జోనల్ కార్యాలయం సమీపంలోని అంజిరెడ్డి భవన్, కొత్తూరు 4 వార్డ్ ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి బూదాల రవి, మేక పావని అధ్యక్షత వహించారు. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మెడికల్ కాలేజీ ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ రైతు విభాగం, సోషల్ మీడియా విభాగ అధ్యక్షులు బందాపు రుక్మాంగిరెడ్డి, భీమిరెడ్డి శరణ్ కుమార్ రెడ్డి(బాబీ) మరియు 4వ వార్డ్ ఇన్‌చార్జి మేకా అంజిరెడ్డి మరియు వార్డులోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మరియు 14వ వార్డు ఇన్‌చార్జ్ రోడ్డ ఎలీషా, మరియు వార్డులోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బ్రెయిన్ హెల్త్ ఆన్‌వీల్స్ అంబులెన్స్ ప్రారంభం

ప్రజాశక్తి - గుంటూరు

పక్షవాత అవగాహన మాసం కార్యక్రమాలలో భాగంగా అక్టోబర్ 19 నుండి 29వ తేదీ వరకూ నిర్వహించనున్న 'బ్రెయిన్ క్యాంప్ ఆన్ వీల్స్' అంబులెన్స్‌ను ఆదివారం ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ పి.విజయ, లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ రాఘవ శర్మ, హాస్పిటల్ డీన్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పి.ఆర్.రాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ అక్టోబర్ నెలను పక్షవాత అవగాహనా మాసంగా నిర్వహించున్నట్లు తెలిపారు. ప్రతి నలుగురిలో ఒకరికి పక్షవాతం బారిన పడుతున్నారన్నారు. 30 సంవత్సరాలు దాటినవారు అందరూ వారు రిస్క్ తెలుసుకుని జాగ్రతలు తీసుకుంటే 80 శాతం పక్షవాతాలు నివారించవచ్చన్నారు. ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, రోటరీక్లబ్, అంకినీడు స్ట్రోక్ సెంటర్, పి.కుటుంబరావు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 'బ్రెయిన్ క్యాంపు ఆన్ వీల్స్' అనే కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. పుర ప్రజలు అందరు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని కోరారు. ఈ క్యాంప్ ద్వారా బిపి, షుగర్, బిఎంఐ, డైట్ కౌన్సెలింగ్ చేసి, రిస్క్ కార్డ్ అందచేయటం జరుగుతుందన్నారు. అనంతరం హాస్పిటల్ ప్రాంగణంలో నిర్వహించిన సదస్సులో రోగులకు పక్షవాతంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఆరోగ్య అవగాహన మరింత పెరుగుతుందని డాక్టర్ రాఘవశర్మ ఆశాభావం వ్యక్తం చేశారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ విజయ, డాక్టర్ రాఘవశర్మ తదితరులు

పెదనందిపాడు రోటరీ క్లబ్‌కు సహకారం అందిస్తాం..

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన - 226 మందికి కంటి పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి - పెదనందిపాడు

పేద, బడుగు, బలహీన వర్గాలకు సేవలందిస్తున్న పెదనందిపాడు రోటరీ క్లబ్‌కు తన సహకారం అందజేస్తామని ప్రముఖ పారిశ్రామికవేత్త పెదనందిపాడు సాయి మందిర్ నిర్వహణ కమిటీ అధ్యక్షులు దాసరి లక్ష్మీ శివరాం ప్రసాద్ అన్నారు. ఆదివారం పెదనందిపాడు అశోక పాఠశాలలో శంకర్ కంటి ఆసుపత్రి పెదకాకాని, గుంటూరు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో, సాయి మందిర్ వారి సౌజన్యంతో 28వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు చిన్నం శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలిశెట్టి వీర రాఘవయ్య మాట్లాడారు. 226 మందికి పరీక్షలు నిర్వహించి 129 మందికి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరందరికీ ఈ నెల 21, 22 తేదీలలో శంకర కంటి ఆసుపత్రి బస్సుల ద్వారా పెదకాకాని తీసుకెళ్లి ఆపరేషన్లు నిర్వహిస్తామని క్యాంపు ఇన్‌చార్జి నాగబాబు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పోపూరి నాగేశ్వరరావు, కోశాధికారి కోడూరి నాగేశ్వరరావు, రోటరీ జిల్లా చైర్మన్ పోపూరి లక్ష్మీనారాయణ, కొల్లా సాంబశివరావు, రోటరీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు గూడూరి వీరయ్య చౌదరి, మాజీ అధ్యక్షులు ఎన్ శివప్రసాద్, జరుగుల రామారావు, బండి నాగరాజు పాఠశాల డైరెక్టర్ నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

మంగళగిరిలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఎందుకు?

వందల కోట్ల రూపాయలు ఖర్చు దేనికి - ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పారిశ్రామివేత్త నన్నపనేని నాగేశ్వరరావు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఎందుకు.. వందల కోట్ల రూపాయలు అవసరమా అని మంగళగిరి పారిశ్రామికవేత్త నన్నపనేని నాగేశ్వరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళగిరి పట్టణంలోని గౌతమ్ బుద్ధ రోడ్డు మీద దుర్గాదేవి గుడి నుండి అంబేద్కర్ విగ్రహం వరకు 250 కోట్ల రూపాయలతో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్లుగా తెలిసిందని, టెండర్లు పిలిచారని పేర్కొన్నారు. ఇది అవసరమా అని ఆలోచించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గౌతమ్ బుద్ధ రోడ్డు ఇండియాలో ఎక్కడా లేనివిధంగా 120 నుండి 180 అడుగుల వెడల్పు రోడ్డుగా 6,8 లైన్స్ రోడ్డుగా ఉందని అన్నారు. వచ్చే డిసెంబర్లో పట్టణానికి పడమర వైపు ఉన్న హైవే ప్రారంభిస్తే దాదాపు అటే భారీ వాహనాలన్నీ వెళతాయని అన్నారు. ఎప్పుడైనా ట్రాఫిక్ జామ్ అయితే కేవలం ఎస్ ఆర్ ఎమ్, విట్ యూనివర్సిటీ బస్సులు వచ్చే సమయంలోనే ఇబ్బందిగా ఉంటుందని అన్నారు. పడమర వైపు ఉన్న బైపాస్ రోడ్డు ప్రారంభిస్తే ఈ బస్సులు కూడా అటే వెళ్తాయని అన్నారు. మూడు ట్రాఫిక్ లైట్స్ పెట్టిన చాలని అన్నారు. ఈ డబ్బులతో మంగళగిరి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచుకోవచ్చునని, ఇంకా ఎన్నో పనులు చేయవచ్చునని ఆయన పేర్కొన్నారు. తెనాలి రోడ్డు పగలగొట్టే పని లేకుండా టువే బస్సులు నడిపించవచ్చునని అన్నారు. అందువల్ల అనవసరపు ఖర్చులు మంగళగిరి పట్టణాభివఅద్ధికి సలహాలు తీసుకోవాలని నాగేశ్వరావు ప్రభుత్వానికి తెలియజేశారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

320వ రోజుకు కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 320వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకులు కే స్టీవెన్, సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, సూర్యప్రకాష్, ఆశీర్వాదం ప్రారంభించారు. దీక్షల్లో బి.నవనీతం, వై.సాంబశివరావు, గురవయ్య, సుబ్బారావు, నాగేశ్వరావు కూర్చున్నారు. కార్యక్రమంలో తుపాకుల నాగేశ్వరావు, రమాదేవి, దుర్గాభవాని, బి.దానయ్య, సుభాని, డి. మాణిక్యారావు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక పట్టణ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సిఐ ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇటీవల నూతన సిఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.సాంబశివరావు స్టేషన్ పరిధిలో తరచుగా జరుగుతున్న వివిధ రకాల నేరాలపై ఆరా తీశారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను పిలిపించారు. రౌడీ షీటర్ల వివరాలను తెలుసుకున్నారు. వారి నేర స్వభావం, ఏఏ కేసులలో నిందితులుగా ఉన్నారు, ఎంత కాలంగా వారిపై రౌడీషీట్ ఉందన్న సమాచారాన్ని తెలుసుకున్న ఆయన వారితో మాట్లాడుతూ ప్రవర్తన మార్చుకోవాలని, రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా తీవ్ర పరిణామాలు ఉంటాయని, అవసరమైతే పిడి యాక్ట్ ప్రయోగించటానికి వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

108లో ప్రసవం - తల్లీబిడ్డ క్షేమం

ప్రజాశక్తి - చేబ్రోలు



అంబులెన్స్‌లో ప్రసవించిన మహిళ

108లో మహిళకు సుఖ ప్రసవం, ఆడబిడ్డ జననం తల్లి బిడ్డ క్షేమం. గుంటూరు జిల్లా అంబులెన్స్ మేనేజర్, పి.బాలకృష్ణ అందించిన సమాచారం మేరకు, మండలంలోని వీరనాయకురిపాలెంకు చెందిన కోడూరి రాణి పురిటి నొప్పులు రావడంతో 108లో తెనాలి జిల్లా సాధారణ ఆసుపత్రికి తరలిస్తుండగా గరువుపాలెం వద్ద నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 సిబ్బంది శంకర్, పైలెట్ కిషోర్ బాబు, యెహెూషువాలు కలిసి ప్రసవం ఏర్పాట్లు చేశారు. ఆడబిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బందికి రాణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. .

ఘనంగా గ్యార్మీ పండుగ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



పండుగను ప్రారంభిస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

మెల్లెంపూడి గ్రామంలో శనివారం రాత్రి గ్యార్మీ పండుగ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టిడిపి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. తొలుత గుండిమెడలో టీడీపీ తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. గుండిమెడ నుంచి మెల్లెంపూడి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ గ్యార్మీ పండుగలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు దాసరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్, తెలుగు రైతు గుంటూరు పార్లమెంట్ అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, మెల్లెంపూడి గ్రామ అధ్యక్షులు షేక్ ఖాశిం బాబు, గుండి మెడ గ్రామ అధ్యక్షులు చిగురు పాటి సుబ్బారావు, షేక్ నాగుల్, బొమ్మారెడ్డి కోటిరెడ్డి, నల్లిబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ట్రంపు చిత్రపటాలను దహనం చేస్తున్న నాయకులు

ట్రంప్ చిత్రపటం దహనం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

భారతపై అమెరికా వేస్తున్న సుఖాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆంధ్రప్రదేశ్ కవుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మకూరులోని నిమ్మగడ్డ రామ్మోహన్ రావు కాలనీలో నరక చతుర్దశి సందర్భంగా భారతకు ప్రమాదకరమైన అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా ట్రంపు యొక్క చిత్రపటాన్ని తగలబెట్టట్టారు. అమెరికా నుంచి భారతదేశానికి పన్నులు లేకుండా డ్రెయిరీ ఉత్పత్తులను, వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేర్చుకోవాలని అమెరికా అధ్యక్షులు ట్రంపు భారత ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నారని ఇది అమలైతే వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో పడుతుంది, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలై దివాళా తీస్తారని, అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు తెలిపారు . ఇప్పటికే ట్రంపు యొక్క టారిఫ్ దాడి విపరీతంగా ఉంది గత 30 సంవత్సరాలలో లక్షలాదిమంది తెలుగువారు అమెరికాలో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అత్యధిక భాగం హెచ్ వన్ బి వీసా మీదనే పనిచేస్తున్నారు. ఇప్పుడు వారందరి భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందన్నారు. ట్రంప్ ఆంక్షలతో ఎప్పుడు ఉద్యోగం పోతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవాచేశారు. మన దేశం నుంచి ఎగుమత అయ్యే రొయ్యలు, డైమండ్, ఆభరణాలు, మందులు, బట్టలు ఆఖరికి సినిమాల పైన కూడా పన్నులు వేస్తున్నారని తెలిపారు. అమెరికా వేస్తున్న సుంకాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడుతుంది. దీనితో వ్యవసాయ కార్మికులకు, పేద మధ్య తరగతి రైతులకు పనులు లేక అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుందని అందువల్ల ప్రజలందరూ ట్రంప్ వేస్తున్న సుంకాలకు వ్యతిరేకంగా పోరాటాలకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మంగళగిరి మండల అధ్యక్షులు జి. అజయ్ కుమార్, సిఐటియు మంగళగిరి మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు, చేనేత కార్మిక సంఘం నాయకులు చిట్యాల సీతారామాంజనేయులు, మహిళా సంఘం నాయకులు జి.లక్ష్మి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మునగాల శ్రీను, చిట్యాల జనార్ధను, ఆనందం బాబ్జి, కె.లక్ష్మి పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్

సాగర్‌లో ముగిసిన గవర్నర్ పర్యటన

వీడ్కోలు పలికిన నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నాగార్జునసాగర్ పర్యటన ఆదివారం ముగిసింది. రెండు రోజుల పర్యటనను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కుటుంబ సమేతంగా నాగార్జున సాగర్‌కు వచ్చారు. సాగర్ పర్యటనలో భాగంగా శనివారం నాగార్జున కొండల్లోని పురావస్తు మ్యూజియాన్ని సందర్శించి, విజయ విహార్ గెస్ట్ హౌస్‌లో బస చేశారు. ఆదివారం నాగార్జునసాగర్‌లోని ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని, నాగార్జునసాగర్ డ్యామ్‌ను, బుద్ధవనాన్ని సందర్శించిన అనంతరం నాలుగు గంటలకు హెలికాప్టర్లో తిరిగి వెళ్లాల్సి ఉండగా ఇతర పర్యటక ప్రాంతాలను ఏమీ సందర్శించకుండా విజయ విహార్ అతిథిగృహంలో విశ్రాంతి తీసుకున్న వీరు మూడు గంటల ముందుగానే బయలుదేరి వెళ్లిపోయారు. అంతకుముందు టూరిజం, రెవెన్యూ అధికారులు సిబ్బందితో ఫొటోలు దిగిన అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గవర్నర్ దంపతులకు బీసీ గురుకుల పాఠశాల ప్రాంగణంలోని హెలిపాడ్‌లో ఘనంగా వీడ్కోలు పలికారు. వీరితోపాటు నాల్గొండ అడిషనల్ కలెక్టర్ నారాయణ అమిత్, డిఎస్‌పి రాజశేఖర్ రాజు, తహశీల్దార్లు శాంతిలాల్, అనిల్ కుమార్, రఘు, కృష్ణయ్య, సాగర్ డ్యాం ఎస్ఇ మల్లికార్జునరావు, ఈఈ సీతారాం, డిస్టిక్ టూరిజం ఆఫీసర్ శివాజీ, కమలా నెహ్రు ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ భాను ప్రసాద్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓలు కృష్ణకుమారి, రవి, రెవెన్యూ ప్రోటోకాల్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.



వీడ్కోలు పలుకుతున్న నల్గొండ కలెక్టర్

హృద్రోగులకు సంజీవని టెనెక్ట్ ప్లస్ ఇంజెక్షన్లు

- ఈ ఏడాది 160 మందికి పైగా గుండెపోటు బాధితులకు ఇంజెక్షన్ ద్వారా 98 శాతం ఫలితాలు
- ప్రజాశక్తితో జిల్లా సెకండరీ హెల్త్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం. ప్రసూన





గుండె పోటుకు గురైన రోగులకు సంజీవనిలా టెనెక్ట్ ప్లస్ ఇంజక్షన్లు పని చేస్తున్నాయని పల్నాడు జిల్లాలో రోగులకు టెనెక్ట్ ప్లస్ ఇంజక్షన్లు ఇవ్వడం ద్వారా 98 శాతం బాధితులను ప్రాణాపాయం నుండి కాపాడామని పల్నాడు జిల్లా సెకండరీ హెల్త్ కోర్డినేటర్ డాక్టర్ ఎం. ప్రసూన అన్నారు. సెకండరీ హెల్త్ హాస్పిటళ్ల ద్వారా మెరుగైన సేవలు సమర్థవంతంగా అందిస్తున్నామని అందిస్తున్న సేవలు విధి విధానాలు తదితర అంశాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ఈ- ఆసుపత్రి (రోగి వివరాలు ఆన్లైన్) నమోదు ప్రక్రియ ఎలా సాగుతుంది? ప్రయోజనం?

నెక్స్ట్ జెన్ ఈ-హాస్పిటల్‌లో రోగి యొక్క వివరాలు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంటు (ఏబిహెచ్ఏ) ఐడి, మొబైల్ నంబర్, పేరు ద్వారా పాత రోగిని వెతకడం, కొత్త రోగి వివరాలు (పేరు, పుట్టిన తేదీ, లింగం, సంప్రదింపు నంబర్) నమోదు చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.అభా కార్డు ఓపిడి, క్యాజువాలిటీ, అపాయింట్మెంట్ వంటి విభాగాలకు వర్తిస్తుంది. కౌంటర్ వద్ద నమోదుకై సిబ్బంది రోగి వివరాలు సంబంధిత విభాగంలో నమోదు చేసి రోగి పరిస్థితి ఎంచుకుని నమోదు తర్వాత శాంపిల్ కలెక్షన్, క్లినికల్ రికార్డు, ఐపిడిలో అడ్మిషన్, బెడ్ అలాట్ వంటి తదుపరి ప్రక్రియలు జరుగుతాయి.

పల్నాడు జిల్లా సెకండరీ హెల్త్ సర్వీసు పరిధిలో ఎన్ని హాస్పిటల్‌లు ఉన్నాయి? వాటి వివరాలు?

ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో పల్నాడు జిల్లాలో 10 ప్రభుత్వ హాస్పిటల్స్ ఉన్నాయి. వీటిలో 3 ఏరియా వైద్యశాలలు నరసరావుపేట, సత్తెనపల్లి, చిలకలూరిపేట పట్టణాలలో ఉండగా మిగిలిన 7 హాస్పిటల్స్ సామాజిక ఆరోగ్య కేంద్రాలుగా మాచర్ల, వినుకొండ, అమరావతి, పెదకూరపాడు, గురజాల, విజయపురి సౌత్, ఈపూరు లో ఉన్నాయి. మాచర్ల విజయపురి సౌత్ హాస్పిటల్స్ ప్రత్యేకంగా గిరిజన ప్రాంతాలకు సేవలందించే ట్రైబల్ హాస్పిటల్స్ గా పనిచేస్తున్నాయి. ఇవన్నీ జిల్లా ప్రజలకు ప్రాథమిక, ద్వితీయ స్థాయి వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

ఏయే హాస్పిటల్‌లలో గుండెపోటు ఇంజక్షన్లు (టెనెక్ట్ ప్లస్) అందుబాటులో ఉన్నాయి? ఇప్పటివరకు ఎంతమందికి ఇచ్చారు?

ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో పల్నాడు జిల్లాలోని 10 ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు సమయానికి అత్యవసర చికిత్స అందించడంలో ఈ హాస్పిటల్స్ కీలక పాత్ర పోషించడంతో పాటు గుండెపోటు వచ్చిన రోగులకు అత్యవసరంగా ఉపయోగించే రూ 40 వేలు విలువైన టెనెక్ట్ ప్లస్ ఇంజక్షన్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుంది. ఇప్పటి వరకు పల్నాడు జిల్లాలో ప్రభుత్వ హాస్పిటల్స్‌లో 160 మందికి పైగా గుండెపోటు వచ్చిన రోగులకు టెనెక్ట్ ప్లస్ ఇంజక్షన్ ఉచితంగా ఇవ్వబడింది. ఈ అత్యవసర చికిత్స ద్వారా 98 శాతం రోగుల ప్రాణాలు రక్షించగలిగాం.

కాన్పుల లక్ష్యాలు ? ఏ మేరకు జరుగుతున్నాయి?

ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో పల్నాడు జిల్లాలోని 10 ప్రభుత్వ హాస్పిటల్స్ లో పడకల సామర్థ్యాన్ని బట్టి నెలవారీ కాన్పుల లక్ష్యాలు నిర్ణయించబడ్డాయి. నరసరావుపేటలోని 200 పడకల ఆసుపత్రికి నెలకు 350 కాన్పులు, సత్తెనపల్లి, చిలకలూరిపేట 100 పడకల ఆసుపత్రులకు ఒక్కో ఆసుపత్రికి 200 కాన్పులు, మాచర్లలోని 50 పడకల గిరిజన ఆసుపత్రికి 100 కాన్పులు, మిగిలిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాలకు ఒక్కో ఆసుపత్రికి 30 కాన్పుల లక్ష్యం నిర్దేశించబడింది. ఈ ఏడాది ఇప్పటి వరకు లక్ష్యం 60.27 శాతం కాన్పులు సాధించగలిగాం.

ఎన్టీఆర్ వైద్య సేవలు గురించి?

జిల్లాలో నరసరావుపేట, సత్తెనపల్లి, చిలకలూరిపేటలో 3 ఏరియా ఆసుపత్రులు, మాచర్ల, వినుకొండ, అమరావతి, పెదకూరపాడు, గురజాల, విజయపురి సౌత్, ఈపూరులో 7 సామాజిక ఆరోగ్య కేంద్రాలు కలిపి మొత్తం 10 ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ సేవల ద్వారా బీపీఎల్ కుటుంబాలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించడంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం కూడా జరుగుతుంది.

నూతన నిర్మాణంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాల వివరాలు?

పల్నాడు జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవల విస్తరణ దిశగా నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. సత్తెనపల్లిలో నూతన ఆసుపత్రి భవనం నిర్మాణం పూర్తి చేసుకుని త్వరలో ప్రజలకు సేవలందించేందుకు సిద్ధంగా ఉంది. మాచర్లలో గర్భిణీ స్త్రీల కోసం ప్రత్యేకంగా బర్త్ వెయిటింగ్ హాల్స్ నిర్మాణం జరుగుతుంది. ఇది ప్రసూతి సేవల నాణ్యతను మెరుగుపరచనుంది. పెదకూరపాడు ప్రాంతంలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించి నూతన భవనం పూర్తిగా నిర్మించబడి ప్రారంభానికి సిద్ధంగా ఉంది.ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతన భవన నిర్మాణ దశలో ఉంది.

అత్యవసర విభాగంలో ఏఏ సేవలు అందుతున్నాయి?

జిల్లాలో 3 ఏరియా ఆసుపత్రులతో పాటు 7 సామాజిక ఆరోగ్య కేంద్రాలలో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ ఆసుపత్రుల్లో విషపూరిత పదార్థాల సేవనం, తల గాయాలు, గుండెపోటు, నరాల సంబంధిత పాక్షికయము, చెదపుటల వలన కలిగే విషపూరిత, ఎంఎల్.సి కేసులు, కత్తిపోటు, ప్రమాద గాయాలు, పక్షవాతం, తీవ్రమైన శ్వాస సంబంధిత సమస్యలకు అత్యవసర తక్షణ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ సేవల ద్వారా ప్రాణాపాయ పరిస్థితులలో సమయానుకూలంగా వైద్య సేవలు అందుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల సామర్థ్యాన్ని పెంచే దిశగా అత్యవసర సేవలు కీలకంగా నిలుస్తున్నాయి.

రోగుల పరీక్షల కోసం ప్రైవేటు ల్యాబ్స్‌తో ఒప్పందాలపై?

3 ఏరియా ఆసుపత్రులు 7 సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన కొన్ని ల్యాబ్ సేవలు అందుబాటులో లేవు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రైవేట్ ల్యాబ్ లతో ఒప్పందం కుదుర్చుకునే వెసులుబాటు కల్పించింది. ఈ ఒప్పందం ద్వారా సిటీ స్కాన్, టీఫ్ఫా స్కాన్ వంటి ముఖ్యమైన డయాగ్నస్టిక్ పరీక్షలు సహా ఇతర ల్యాబ్ సేవలు ప్రజలకు పూర్తిగా ఉచితంగా అందించబడుతున్నాయి.

సెకండరీ హెల్త్ సర్వీస్ పరిధి ఆసుపత్రులలో ఎన్ని 30 పడకలు, 100 పడకల ఆసుపత్రులుగా మారేందుకు ప్రతిపాదనలు ఏమైనా ఉన్నాయా?

పల్నాడు జిల్లాలోని మాచర్ల, వినుకొండలో ఉన్న 50, 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాలను 100 పడకల ఆసుపత్రులుగా అభివద్ధి చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ఈ క్రమంలో వినుకొండ ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆసుపత్రిగా విస్తరించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. నిర్మాణ పనుల కోసం అవసరమైన స్థలాన్ని గుర్తించడం జరిగింది. మాచర్లలోని 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. ప్రస్తుతం అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉంది.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

గుంతలు పూడ్చండి మహాప్రభో..



గుంతలమయంగా తుళ్లూరు - రాయపూడి రోడ్డు..

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు - రాయపూడి మధ్య ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది.భారీ వాహనాల రాకపోకల కారణంగా రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి.దీంతో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.రాజధాని నేపథ్యంలో ఈ మార్గంలో నిర్మాణ సామాగ్రితో భారీ వాహనాలతో పాటు ఇసుక టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్ల రాకపోకలు నిత్యం సాగుతుంటాయి. అమరావతి నుంచి విజయవాడ,గుంటూరు నుంచి రాజధానికి తుళ్లూరు - రాయపూడి మీదుగానే ఆర్ టి సి బస్సుల రాకపోకలు జరుగుతుంటాయి.ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన బస్సులు కూడా ఈ మార్గం గుండానే వెళుతుంటాయి.పెద్ద సంఖ్యలో భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్డు గుంతలమయంగా మారిందని,వర్షం వచ్చినప్పుడు గుంతల్లోకి నీరు చేరి రాకపోకలకు మరింత ఇబ్బంది కలుగుతోందని వాహనదారులు అంటున్నారు.తాడికొండ నుంచి తుళ్లూరు, రాయపూడి వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు చెబుతున్నా ప్రస్తుత పరిస్థితుల దఅష్ట్యా తక్షణమే గుంతలను పూడ్చి వేయాలని వాహనదారులు కోరుతున్నారు.